www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబర్ 2024



పుస్తక పఠనంతోనే ఏకాగ్రత : కలెక్టర్

ఏలూరు: పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థినులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. తొలుత గ్రంథాయలంలోని సందర్శన పుస్తకంలో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తకాలు చదివే అలావాటు వల్ల లక్ష్యాన్ని నిర్దేశించుకునే స్పృహ ఏర్పడుతుందన్నారు. టీనేజిలోనే తప్పనిసరిగా పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ బాగా చదవి విలువలు కలిగిన పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, జిల్లా గ్రంథాలయాల సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

చి'వరి'లో టెన్షన్..!

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. శుక్ర, శనివారాల్లో వర్షం పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. దీంతో అన్నదాత గుండెల్లో గుబులు నెలకొంది. పలు ప్రాంతాల్లో గురువారం చిన్నపాటి జల్లులు సైతం పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పంట చివరి దశలో ఉండడంతో వర్షాలు పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది.



భీమడోలు మండలం పాతూరు వద్ద జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యం

అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు
అన్నదాత గుండెల్లో గుబులు
రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వరిసాగు
ముమ్మరంగా ఖరీఫ్ మాసూళ్లు
తడి, పొడి ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : రైతులు
ప్రస్తుత ఖరీఫ్‌లో వరదలకు రెండు సార్లు 28 వేల ఎకరాల్లో పైగా పంటనష్టం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. వరదలు, తుపాన్లతో ఎన్నో వ్యయప్రయాశలకు ఓర్చి పంటను కాపాడుకుంటూ వచ్చారు. పంట చివరిదశకు చేరింది. ఖరీఫ్ మాసూళ్లు మమ్మురంగా ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకూ పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తికాగా ఏలూరు జిల్లాలో 20 శాతం వరకూ మాసూళ్లు జరిగినట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, భీమడోలుతోపాటు పలు మండలాల్లో రైతులు కోతలు మమ్మురంగా సాగుతుండగా, పశ్చిమలో తాడేపల్లిగూడెం, పెంటపాడు, తణుకు వంటి పలు మండలాల్లో మాసూళ్లు కొనసాగుతున్నాయి. యంత్రాలతో వరి కోతలు కోయడంతో రైతులు ధాన్యం ఆరబెట్టాల్సి వస్తోంది. మిషన్లతో మాసూళ్లు చేయడంతో ధాన్యంలో తేమశాతం 20 శాతానికి పైగా ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే తేమ 17 శాతం దాటకూడదు. దీంతో రైతులు ధాన్యం అరబెట్టి విక్రయించాల్సి వస్తోంది. జాతీయ రహదారులపై, పుంతరోడ్లపై రైతులు ధాన్యం అరబెట్టిన పరిస్థితి. ఈ తరుణంలో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో రైతులు పరుగులు తీస్తున్నారు. వాతావరణ మార్పులతో ఎండ తక్కువగా ఉండడంతో ధాన్యం త్వరగా ఆరని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు తీవ్రంగా నలిగిలిపోతున్నారు. ధాన్యం ఆరబెట్టేందుకు కళ్లాలు లేకపోవడం, సరిపడా బరకాలు లేకపోవడంతో తడి, పొడి ధాన్యం విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో వ్యాపారులు రైతును అయినకాడికి దోచుకునేందుకు సిద్ధమయ్యారు. 75 కిలోల బస్తా ధాన్యం రూ.1,725 వరకూ ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించగా దళారులు తడి, పొడి ధాన్యం పేరుతో బస్తాకు రూ.1,350 నుంచి రూ.1,400 మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు బస్తాకు రూ.300లకుపైగా నష్టపోతున్న పరిస్థితి. తడిపొడి ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఏటా పెద్ద ఎత్తున నష్టాలు చవిచూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లలో సైతం ప్రభుత్వం రైతులకు అనుకూలంగా మార్పులు చేయాలని కోరుతున్నారు.

ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు సార్లు పంట నష్టం

ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఈ ఏడాది జులై, సెప్టెంబర్‌లో రెండు సార్లు విరుచుకుపడిన వర్షాలు, వరదలు, వరదలకు రెండు జిల్లాల్లోనూ దాదాపు రూ.27 కోట్ల మేర పంట నష్టం జరిగింది. జులైలో విరుచుకుపడిన వరదలకు పశ్చిమలో 12,597 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా రైతులకు రూ.పది కోట్ల మేర నష్టపరిహారం అందించాలని అధికారులు నివేదించారు. ఏలూరు జిల్లాలో 350 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, రైతులకు రూ.కోటి వరకూ నష్టం పరిహారం అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. సెప్టెంబర్‌లో విరుచుకుపడిన భారీ వర్షాలు, వరదలకు ఏలూరు జిల్లాలో 7,484 ఎకరాలు పంటనష్టం వాటిల్లగా రూ.7.48 కోట్ల నష్టపరిహారం, పశ్చిమలో 8,546 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా రూ.8.55 కోట్లు నష్టపరిహారం మొత్తం రూ.16 కోట్లు అందించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. సెప్టెంబర్‌లో జరిగిన నష్టపరిహారం రైతులకు ప్రభుత్వం అందించింది. జులైలో జరిగిన నష్టపరిహారం మాత్రం రైతులకు ఇంకా అందలేదు. 33 శాతంపైగా నష్టపోయిన పొలాలను మాత్రమే పరిగణలోకి తీసుకున్నారు. 33 శాతంలోపు నష్టపోయిన పంటపొలాలు వేలాది ఎకరాలు ఉన్నాయి. వరదలకు దెబ్బతినగా మిగిలిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా కష్టాలు పడ్డారు. ఈ తరుణంలో వర్షాలు పడితే జిల్లా రైతాంగానికి కోలుకోలేని దెబ్బతగలనుంది. ధాన్యం కొనుగోలు వేగంగా జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సుస్థిర అభివృద్ధిలో.. సహకార సంఘాల పాత్ర కీలకం



పతాకావిష్కరణ అనంతరం ప్రతిజ్ఞ చేస్తున్న డిసిఒ శ్రీనివాసు, సిబ్బంది

సహకార వారోత్సవాల్లో డిసిఒ ఎ.శ్రీనివాసు
జిల్లా కార్యాలయం వద్ద పతకావిష్కరణ
వారంరోజుల కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సుపరిపాలన, సుస్థిర జీవనోపాధి, అభివృద్ధిలో సహకార సంఘాలు కీలక భూమికగా వ్యవహరించాలన్న ప్రధాన ఉద్దేశంతో 71 అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి ఎ.శ్రీనివాసు తెలిపారు. సహకార వారోత్సవాల కార్యక్రమాన్ని ఆయన గురువారం జిల్లా సహకార కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా అన్ని సహకార సంఘాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఆదేశించినట్లు తెలిపారు. సహకార వారోత్సవాల్లో ప్రధానాంశంగా ఈ ఏడాది 'వికసిత్ భారత్ నిర్మాణంలో సహకార సంఘాల పాత్ర' అనే నినాదంతో జరగనున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సహకార సంఘాల నూతన ఆవిష్కరణలు తీసుకొచ్చి సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పనిచేయాలని సిబ్బందికి సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక సమావేశ కార్యక్రమాలు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 14వ తేదీ గురువారం తొలిరోజు సహకార మంత్రిత్వశాఖ నూతన కార్యక్రమాల ద్వారా సహకార ఉద్యమాన్ని బలోపేతం చేయడం, 15న సహకార సంఘాల్లో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత, సుపరిపాలన, 16న వ్యవస్థాపకత, ఉపాధికల్పన, నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంలో సహకార సంఘాల పాత్ర, 17న సహకార సంస్థలు, వ్యాపార ప్రయోజిత సంస్థలుగా రూపాంతరం, 18న సహకార సంఘాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, 19న మహిళలు, యువత, బలహీన వర్గాల కోసం సహకార సంఘాలు, 20న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర వంటి అంశాలపై సమావేశాలు కొనసాగుతాయన్నారు. సహకార శాఖ అధికారులు ఆర్.త్రినాథ్, వారోత్సవాల ఇన్‌ఛార్జి ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార వారోత్సవాల్లో సిబ్బంది పాల్గొనాలన్నారు. రోజు వారీ చేపట్టే కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కార్యాలయ సూపరింటెండెంట్ ఎవిఎన్.మూర్తి, సిబ్బంది ఎం.నరసింహరాజు, ఎన్.ప్రసాదరావు, నాగేశ్వరరావు, మన్నేబాబు, అక్రమ్ భాషా, అసిస్టెంట్ రిజిస్టర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలి

22న ఏలూరులో సదస్సు - రౌండ్ టేబుల్ సమావేశంలో వామపక్ష నేతల పిలుపు



అభివాదం చేస్తున్న వామపక్షాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, విద్యుత్ ఛార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న ఏలూరులో జరిగే సదస్సును జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో గురువారం వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు, పి.కిషోర్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ బండి వెంకటేశ్వరరావు, టౌన్ కార్యదర్శి యు.హేమశేఖర్, ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు సముద్రాల సుందరం తదితరులు పాల్గొన్నారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని, ఎఫ్ సిసిసిఎ ఛార్జీల పేరుతో ప్రజలపై వేస్తున్న రూ.6,072 కోట్ల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ముందుగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. నివాస గృహాలకు మీటర్లు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం కొనసాగిస్తున్నారన్నారు. వ్యవసాయంపై ఏ భారమూ ఉండదని పైకి చెబుతున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి, జనసేన తీవ్రంగా వ్యతిరేకించాయని, ఆ నేతలు మీటర్లు పగలగొట్టాలని పిలుపు కూడా ఇచ్చారని తెలిపారు. నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కూ స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మక ద్రోహమేనని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైసిపి, నేడు టిడిపి, జనసేన ఈ మీటర్లను కొనసాగించడం గర్హనీయమన్నారు. ఇప్పటికే రూ.17 వేల కోట్లు ట్రూఅప్ ఛార్జీల భారం వేస్తున్నారని, మరోవైపు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని, ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదని తెలిపారు. ఎంసిపిఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ ప్రతి మీటర్‌కూ అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీల అంశంపై వైసిపి దారిలోనే టిడిపి ప్రభుత్వం ప్రయాణిస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు సమైక్యమై ప్రతిఘటించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్షాల పిలుపుపై జరిగే ఆందోళనలలో ప్రజలు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఈదర సుబ్బమ్మదేవి నగర బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బాలల దినోత్సవం-బాలల హక్కుల దినోత్సవాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అన్ని విధాలా కృషి చేస్తోందన్నారు. చదవుతోనే వ్యక్తిత్వం, సామాజిక అభివృద్ధి, ఆర్థికాభివృద్ధి సాధించగలమన్నారు. క్రమశిక్షణ అంకితభావంతో ఎంతటి ఉన్నత స్థాయికైనా ఎదగొచ్చన్నారు. తమకు నచ్చిన సబ్జెక్ట్‌లను ఎంచుకొని అందుకు అనుగుణంగా భవిష్యత్ లక్ష్యాలను నిర్ధేశించుకోవాలన్నారు. బాలికల సంరక్షణలో గతంలో కన్నా ప్రస్తుతం ఎన్నో రక్షణ చర్యలు కల్పించబడ్డాయన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు జె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలబాలికలు చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కె.పద్మావతి, డిఇఒ వెంకట లక్ష్మమ్మ, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిసిపిఒ సిహెచ్.సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్ : బాల బాలికలు చదువులోనే కాకుండా ఆటల పాటలు, నృత్య పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ మైదానంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సురేష్ బాబునా పాఠశాలకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఎస్‌పి మాట్లాడారు. విద్యార్థులే రేపటి దేశ భవిత్తుకు రూపకర్తలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎఆర్ అదనపు ఎస్‌పి ఎన్ఎస్ఎస్ శేఖర్, డిఎస్‌పి శ్రావణ్ కుమార్, పిఆర్‌డిఎస్‌పి శ్రీహరి ఏలూరు ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ, రెండో పట్టణ సిఐ వైవి రమణ, మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

తహశీల్దార్ కార్యాలయాల సిపిఎం ధర్నాలు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేయలేదు గాని, నాన్నకి ఇంధనం ఇచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. సిపిఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపిల కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇసుక సమస్యను పరిష్కరించి వినియోగదారులకు ఉచితంగా అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నిక విధానాన్ని తీసుకొచ్చి ఫెడరల్ వ్యవస్థకు భంగం కలిగించాలని చూస్తుందని, దీన్ని రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన ఏడు పంచాయతీలకు గోదావరి జలాలను అందించాలన్నారు. ఏలూరులో టిడ్కో లబ్ధిదారులకు వెంటనే ఇళ్ల అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఈ ఆదిశేషు, ఏ శ్యామలా రాణి, అరుణకుమారి, బి.జగన్నాథరావు, జి.రవికిషోర్, కనకారావు, సత్యనారాయణ, గోపి చంద్రశేఖర్, బుజ్జి, షరీఫ్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, కరెంటు ట్రూ వాప్ ఛార్జీలను రద్దు చేయాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నూజివీడు తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎంఆర్.హనుమాన్లు, బి.రాంబాబు, ఎ.ప్రభాకరరావు, యాగంటి సీత, పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కె.సుభాషిని, ఎస్‌కె.మాబుసుభాని, పార్టీ నాయ కులు యు.సత్యనారాయణ, ఆర్.రామచంద్రం, బొబ్బిలి గంగ రాజు, సిహెచ్.లక్ష్మీనారాయణ, వి.అనుమకుమారి పాల్గొన్నారు.

ముసునూరు : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు ప్రజల, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు, కంచర్ల శ్రీను, కంచర్ల సుబ్బారావు, కంచర్ల దుర్గారావు, కంచర్ల రమేష్, అనగాని వెంకటేశ్వరరావు, శ్రీను, గొల్లపల్లి మధు, పిల్లి మురళీ, గంగుల సత్యం పాల్గొన్నారు.

నూజివీడు మండల కార్యదర్శి పి.బోస్, సిపిఎం నాయకులు పాపారావు, గుర్రం ప్రసాద్, సుబ్బారావు, పద్మాంజలి, వసంతరావు, శోభనాద్రి, నాగరాజు, ప్రభాకర్, సంసోను, రాంబాబు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు, గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, కానూరు రాజు, సంకెళ్ల మోహన్‌రావు, పిల్లా సూరిబాబు, పి.దేవి, ఎన్.పద్మావతి పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కి అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రామకృష్ణ, మండల నాయకులు అనుమోలు మురళీ, మండల కమిటీ సభ్యులు మడకం సుధారాణి, మడకం కుమారి, ఎఎస్ఆర్ నగర్ గ్రామస్తులు పాల్గొన్నారు.



కలిదిండిలో...

జంగారెడ్డిగూడెం : తహశీల్దార్ కార్యాలయం వద్ద వంగా గోపీ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జీవరత్నం, పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించ చకపోతే పేదలందరినీ ఐక్యం చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొం దించి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రం,

జీలుగుమిల్లి : ప్రజా సంఘాల కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి దుర్గారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస కాలనీల్లో అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ బి.సందీప్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎస్.సీతారామయ్య, సిహెచ్. కొండలరావు, గంగరాజు, కన్నమ్మ, గంగులు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు మాట్లాడుతూ గిరిజనులకి, దళితులకు బడ్జెట్ కేటాయింపుల్లో పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. అనంతరం తహశీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కారం వెంకట్రావు, గుమ్మల వెంకట నరసయ్య, కొత్త వెంకటేశ్వర్లు, మాడి ప్రసాద్‌రెడ్డి, కరటం ప్రకాష్, కేచ్చేలా వెంకటేశ్వరరెడ్డి, కరటం మల్లేష్, నాగేంద్రబాబు, వీర్రాజు, నాగు,



నూజివీడులో....

రామ్‌కిరణ్, ప్రసాద్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, ఊకె రాజులు, లింగయ్య పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధిక ధరలు తగ్గించాలని, ఇళ్ల స్థలాలు, భూముల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను వీడనాడాలని, ప్రజా సమస్యల పరిష్కరించాలని కోరారు. లేకపోతే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.దావీదు, కె.జగదీష్, బొడ్డు ఆదాము, యెహోషువ, రఫాయిల్, ఇంటి సురేష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్ర మంలో సిపిఎం నాయకులు ఉల్లంకి నాంచారయ్య, ఆలపాటి కుటుంబరావు, సీతమ్మ, మట్లపూడి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ జి.పవన్‌కుమార్‌కు వినతిపత్రం



జంగారెడ్డిగూడెంలో..

అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, ఎస్‌కె.జహంగీర్ బాషా, ఎన్.ఊళక్కయ్య, ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు, జె.శామ్యూల్, ఎం.సుభాకరరావు, ఎం.స్టాలిన్ పాల్గొన్నారు.

చింతలపూడి : బోసుబొమ్మ సెంటర్ వద్ద దుకాణాల్లో ప్రజాపోరు కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా సిపిఎం చింతలపూడి ఏరియా కన్వీనర్ ఆర్‌విఎస్.నారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాండురంగారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో...

బుట్టాయగూడెం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ పాయం రమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ ఏజెన్సీలో భూ వివాదాలు తలెత్తిన్నప్పుడు రెవెన్యూ అధికారులు ఇరు పక్షాల రికార్డులు టైటిల్ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొడియం నాగమణి, ఉడతా వెంకటేష్, పోలోజు నాగేశ్వరరావు, టి.వెంకటలక్ష్మి, కారం భాస్కర్, చంద్రు బుల్లెమ్మ, కొయ్యల శ్రీను, మడకం శ్రీదేవి, పొడియం రాజు, కారం ముత్యాలరావు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ వైసిపి హయాంలో విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలను వ్యతిరేకించిన టిడిపి, జనసేన పార్టీలు నేడు అధికారంలోకొచ్చాక అదే ఒరవడిని కొనసాగించడం దుర్మార్గమన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సిపిఎం కార్యకర్తలు కె.శ్రీనివాసరావు, ఎస్ఎన్‌వి.సత్యనారాయణ, జి.వినోద్, బి.రామనాగేంద్రం, పి.రమేష్, జి.అనిల్ కుమార్, కె.శేషగిరిరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి సిపిఎం మండల కమిటీ సభ్యులు సాయికిరణ్, బుయ్యన శ్రీను, షేక్ వలీ పాషా, గిరిజన సంఘ నాయకులు పొట్ల లక్ష్మయ్య, మహబూబ్‌బాషా, పూల దాస్ రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన గురువారం స్థానిక దొండపాడులోని పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే బాలబాలికలు చదువుతోపాటు అన్ని విషయాల్లో అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు నేడు ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్ పాల్గొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ భవనంలో, శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

నూజివీడు టౌన్ : మండలంలోని గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ బావిశెట్టి వీరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని రాధికారాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బొమ్మలు వేయటం అలవాటు చేసుకోవాలని, జాతీయ నాయకుల గురించి తెలుసుకోవాలని చెప్పారు. తెలుగు ఉపాధ్యాయులు మోహన్‌రావు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

చాట్రాయి : యువత జాతీయ నాయకులను, స్వాతంత్ర సమరయోధులను, దేశభక్తిని పూర్తిగా మర్చిపోయారని విద్యార్థుల్లో విద్యార్థి దశ నుంచి దేశభక్తిని, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్ర నేర్పాలని ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు అన్నారు. బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి సందర్భంగా మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు స్వాతంత్ర సమర యోధుల, జాతీయ నాయకుల వేషధారణలతో పాఠశాలకు వచ్చారు. జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఎస్‌కె.హసీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏలూరు సిటీ జనరల్ సెక్రటరీ సాదే, నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో చింతలపూడి ప్రభుత్వ హైస్కూల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన పెంచే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వరరావు ఐసిడిఎస్ పిఒ మాధవి, ఎంఇఒ కిరణ్ బాబు, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, అడ్వకేట్స్ పి.డేవిడ్‌రాజు, ఎస్‌కె.ఉమర్ ఫారూఖ్, కెకె.దుర్గాభవాని, సోషల్ వర్కర్, అక్బర్ ఆలీ, పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు మండలంలోని 16 గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి : అయ్యవారి రుద్రవరంలోని మండల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిరిగిరి పిచ్చోడు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూకి బాలలంటే ఎంతో ఇష్టమని చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందించడంతోపాటు మిఠాయిలను పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామవరపుకోట : స్థానిక కొత్తూరులోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిరిగినేటి ఛారిటీ ట్రస్ట్, జనసేన మండల నాయకులు సిరిగినేటి వెంకన్నబాబు మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లలిత కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవం ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా సుధామ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సుధా బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ ఆటలు మనసును, శరీరాన్ని చైతన్యపరచి విద్యార్థుల శక్తి సామర్థ్యాలను నైపుణ్యాలను వెలికితీస్తాయన్నారు. అనంతరం సుధామ ఫౌండేషన్ వారి సౌజన్యంతో విద్యార్థులకు మెమొంటోలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి అధ్యక్షులు కృష్ణవేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ హాస్పటల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రిలో చిన్నారులకు అన్ని వైద్య పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన మందులు అందించినట్లు హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్ పెదపూడి ప్రసంగి తెలిపారు. చిన్నారులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు యనమదల సుధీర్, ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి యేకుల ప్రవీణ్‌కుమార్, ఇతర వైద్యులు చిన్నం దీప్తి, అవినాష్, లిల్లీ, రామారావు, లక్ష్మీప్రియాంక, ఏంజలీన్, ప్రీతి, ఇవాంజలిన్, అసిస్టెంట్ ఎడ్విన్ పాల్, నర్సింగ్ కళాశాల సూపరింటెండెంట్ ఎవాంజెలిన్‌రావ్, ఐ కేర్ మేనేజర్ జి.దత్తం, అసోసియేట్ పిఆర్ఒ దేవరపల్లి జాషువా పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

ఏలూరు : సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నేపథ్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు, ఇతరులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 253 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, 11 మీడియం ఇరిగేషన్ ట్యాంకులు, 92 మేజర్ ఇరిగేషన్ ట్యాంకులకు సంబంధించి 356 సాగునీటి వినియోగదారు సంఘాలు ఉన్నాయన్నారు. కృష్ణా డెల్టా సిస్టంలో ఎనిమిది, గోదావరి డెల్టా సిస్టంలో నాలుగు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు-2 కలిపి మొత్తం 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. తమ్మిలేరు, ఎర్రకాలువకు సంబంధించి రెండు ప్రాజెక్ట్ కమిటీలు ఉన్నాయన్నారు. ఇరిగేషన్ ఎస్‌సి దేవప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుల ఎంపిక కోసం అసాధారణ జనరల్ వార్డు సమావేశం ప్రారంభించాలన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రాదేశిక నియోజకవర్గం ఓటు వినియోగానికి వేదిక వద్దకు ఓటు హక్కు కలిగిన రైతులందరినీ అనుమతించాలన్నారు. ప్రభుత్వం, ఎన్నికల అధికారి, జిల్లా ఎన్నికల అథారిటీ ద్వారా అధికారం పొందిన వ్యక్తులు మాత్రమే వేదిక వద్దకు అనుమతించాలన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ఏకాభిప్రాయం, పరిస్థితుల్లో ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల పోస్టు కోసం పోటీదారుల నుంచి నామినేషన్ స్వీకరించా లన్నారు. ఓటింగ్ స్లిప్పుల పంపిణీ ద్వారా ఎంపిక చేసే విధానం, ఓటింగ్ స్లిప్ తయారీ పంపిణీ, ఓటింగ్ బాక్స్ తయారీ, ఓటింగ్ స్లిప్పుల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఎన్నికల సర్టిఫికెట్ జారీ చేయడం అంశాలను ఆయన వివరిం చారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వ రరావు, ఇరిగేషన్ ఎస్ఇ సిహెచ్.దేవప్రకాష్, ఆర్‌డిఒలు అచ్యుత అంబరీష్, ఎం.వెంకటరమణ, ఎం.వాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - మండవల్లి

గెలుపోటములు అనేవి ముఖ్యం కాదని, ప్రతి పోటీల్లో ధైర్యంగా పాల్గొనడమే విజయానికి నాంది అని మహిళా పోలీసు ప్రమీల అన్నారు. పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్ఐ రామచంద్రరావు ఆదేశాల మేరకు సైబర్ నేరాల నివారణలో యువత పాత్రపై పులపర్రు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బాలల దినోత్సవం పురస్కరించుకుని బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పోటీ తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. ఓటమి నుంచి గెలుపొందడానికి అనేక సూత్రాలను మెలకువలను నేర్చుకోవచ్చుని తెలిపారు. కాట్రగడ్డ శంకరరావు చేతుల మీదుగా బహుమతులను పంపిణీ చేశారు.

చింతల శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కైకరానికి చెందిన టిడిపి నాయకుడు చింతల శ్రీనివాస్‌ను సర్పంచి సనగల గోపీ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. కైకరం ఉప సర్పంచి, సర్పంచి, ఉంగుటూరు జెడ్‌పిటిసి సభ్యులు, జెడ్‌పిటిసి ఛాంబరు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షునిగా చింతల శ్రీనివాస్ సేవలందించారు. తాజాగా ప్రభుత్వం కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ల జాబితాను ప్రకటించింది. అందులో శ్రీనివాస్‌కు చోటు కల్పించారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - కామవరపుకోట

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు పుట్టినరోజును పురస్కరించుకుని ఎన్ఆర్ఐ పారేపల్లి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు ఆసరా లేని వృద్ధులకు, వికలాంగులకు అన్నదానం నిర్వ హించడానికి ముందుకు వచ్చినట్లు కామవరపుకోటలోని శ్రీ వీరభద్ర హెల్పింగ్ హ్యాం డ్స్ ఛైర్మన్ కడిపి పాపారావు తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు ఎల్లవేళలా సహాయ సహకారాలు చేస్తున్న పారేపల్లి సతీష్ కుమార్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భూసేకరణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం చేసే భూసేకరణ పనులను సంబంధిత ఆర్‌డిఒలు ఎప్పటికప్పుడు సంబంధిత తహశీల్దార్లతో సమీక్షించి వేగవంతం అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, పరిశ్రమలు, ఫిషింగ్ ఔట్లెట్స్ ఏర్పాటు, తదితర పనులకు సంబంధించి భూసేకరణ అంశాలను గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్న దృష్ట్యా, వాటికి సంబంధించిన భూసేకరణ పనులు వేగవంతమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌హెచ్-365, ఎన్‌హెచ్-165, ఎన్ హెచ్ 365 బిబి, బిజి, రహదారులకు సంబంధించి ఖమ్మం-దేవరపల్లి, జీలుగుమిల్లి-పట్టిసీమ, పామర్రు-ఆకివీడు రహదారి పనులకు సంబంధించి భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి కోర్టుల్లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఆర్‌డిఒలు సంబంధిత తహశీల్దార్లతో భూసేకరణ అంశాలకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - కుక్కునూరు

జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, వెలుగు సిబ్బందికి, గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎల్‌పిఒ డివిజనల్ పంచాయతీ అధికారి రజవుల్లా మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు 2025-2026 సంవత్సరానికి వారి వారి పంచాయతీ ఆదాయాన్ని బట్టి అభివృద్ధి ప్రణాళికను తయారు చేయాలని చెప్పారు.

ముసునూరు : ప్రణాళిక ప్రకారం అభివృద్ధికే గ్రామపంచాయతీ నిధులు ఉపయోగించాలని ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, పంచాయతీ రాజ్ శాఖ అధికారు లకు, సచివాలయ సిబ్బందికి గురువారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ పలు అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

కామవరపుకోట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సరైన క్రమ పద్ధతిలో వినియోగించుకోవడం ద్వారా పంచాయతీలు అభివృద్ధి చేసేందుకు వీలు ఉంటుందని కామవరపుకోట ఎంపిడిఒ ఎం.సరళకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2025-2026 సంవత్సరానికి వార్షిక ప్రణాళిక సిద్ధం చేసి సమర్పించేందుకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి సమగ్ర ప్రణాళిక తయారు చేయడం గురించి పంచాయతీ సిబ్బందికి, మండల గ్రామ సమాఖ్య అధ్యక్షురాలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-1 సుబ్బారావు, పంచాయతీ రాజ్ ఆశిక్, ఎపిఎం సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయ ఎఒ సత్యవేణి, పలువురు పంచాయతీ, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : జిపిడిపి, బిపిడిపి 2025-26 వార్షిక ప్రణాళికలు సిద్ధం చేసేందుకు ఏలూరు రూరల్, దెందులూరు మండల స్థాయిలో మండల కేంద్రాల్లో శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. సదరు కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, మండల సమైఖ్య అధ్యక్షురాలు హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏలూరు ఎంపిడిఒ శ్రీలత, దెందులూరు ఎంపిడిఒ శ్రీదేవి పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - టి.నరసాపురం


విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఎంపిడిఒ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్, టివిలకు బానిసలు కాకుండా పుస్తకాలు చదవాలన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్, విజన్ యుపి స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వ్యాయమ ఉపాధ్యాయులు కె.రాజు, పలు పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎపి టూరిజం కార్పొరేషన్ బోర్డ్ మెంబర్ కొడాలి వినోద్ పాల్గొన్నారు. గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ జవహర్ లాల్ నెహ్రు, గ్రంథాలయాల పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి పాఠశాల, ఇండో సాక్సన్, గౌతమ్ స్కూల్, ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కె.వెంకటసుబ్బారావు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక ఏలూరు బాలల గ్రంథాలయంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు జడ్జి శనగరపు ఉమా సునంద ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారం శెట్టి రమేష్ బాబు, గ్రంథాలయ నిర్వాహకురాలు ఎం.శోభ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఆగిరిపల్లి సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు అన్నారు. ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు కె.సర్వేశ్వరరావు, కె.ఆనంద్ కుమార్, మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయదుర్గ, గ్రామ ప్రముఖులు విక్టర్‌బాబు, గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మండవల్లి : విద్యార్థుల జ్ఞాన సంపదకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను స్థానిక గ్రంథాలయం వద్ద ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞానం దాగి ఉందని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు. గ్రంథాలయ నిర్వహకురాలు షేక్ పరివిన మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, హెచ్ఎం కె.సూర్యారావు, కానుకొల్లు బుక్ డిపాజిట్ సెంటర్ వడ్డీ కాసులు, సులోచన పాల్గొన్నారు.



కలిదిండి : మండలంలోని కోరుకొల్లు శాఖా గ్రంథాలయంలో సర్పంచి బట్టు లీలా కనక దుర్గామహేష్ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. జవహర్ లాల్ నెహ్రూ, అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలిదిండి శాఖా గ్రంథాలయంలో నెహ్రూ, వెంకట రమణయ్య చిత్ర పటాలకు రిటైర్డ్ టీచర్స్ శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, రాంబాబు, జగన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు, పలు పాఠశాలల విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పెదపాడు : పెదపాడు శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి పెదపాడు ఎంపిడిఒ ఎండి.ఆమీలు జమ, పంచాయతీ కార్యదర్శి డి.వినోద్‌కుమార్, ఎంపిడిఒ కార్యాలయ సూపరిండెంట్ రవికుమార్, ఎంపిపి స్కూల్ హెచ్ఎం వేల్పుల ప్రభాకర్, విఆర్ఒ ఎ.నరసింహరావు, పెదపాడు మానవతా కన్వీనర్ కె.రామకృష్ణ, గురుకులం స్కూల్ హెచ్ఎం ఆర్.బెంజిమెన్, ,ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎంపి మహేష్‌కుమార్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అండగా నిలిచారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపీ మహేష్ కుమార్ కువ్వాడ నుంచి బుట్టాయగూడెనికి టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులుతో కలిసి గురువారం బయలుదేరారు. మార్గమధ్యలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో కన్నాపురం గ్రామానికి చెందిన సరిపోళ్లు గంగరాజు, అతని భార్య గాయపడ్డారు. స్పందించిన ఎంపీ మహేష్ కుమార్ కారులో నుంచి కిందకు దిగి గంగరాజు దంపతులను పరామర్శించారు. ఎంపీ ఆదేశాల మేరకు వ్యక్తిగత సిబ్బంది గంగరాజు దంపతులకు సపర్యలు చేశారు. ద్విచక్ర వాహనం ధ్వంసం కావడంతో క్షతగాత్రులకు ఎంపీ కొంత ఆర్థిక సాయం అందించారు. వారిని మరో వాహనంలో ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు వివరాలు సేకరించాలని ఎంపీ మహేష్‌కుమార్ పోలీసులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే తక్షణం స్పందించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను ఆటుగా వెళ్తున్న వాహన చోదకులు ప్రశంసించారు.

డిఎస్‌సి అభ్యర్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబమంతా పేదరికం నుంచి బయటపడుతుందని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరులోని కెపిడిటి హై స్కూల్ ప్రాంగణంలో ఉన్న ఆడిటోరియంలో నిర్వహిస్తున్న వంద రోజుల ఉచిత డిఎస్‌సి కోచింగ్ అభ్యర్థులకు గురువారం చింతమనేని ప్రభాకర్ ఉచితంగా పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఇంతటి గొప్ప కార్యానికి సహకరిస్తున్న రైస్ మిల్లర్ల అసోసియేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ఉద్యోగం సాధిస్తే వారి కుటుంబం మొత్తం పేదరికం నుంచి బయట పడుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఉన్నా, ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని కోరారు. అభ్యర్థులకు భోజన సదుపాయంతో పాటు అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని అభ్యర్థులు విజయాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. అనంతరం అభ్యర్థులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా రత్నారావు

ప్రజాశక్తి - కలిదిండి



నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా లంకా రత్నారావు నియమితులయ్యారు. కలిదిండికి చెందిన లంకా రత్నారావు టిడిపిలో చురుకైన పాత్ర పోషిస్తూ, రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా పదవి దక్కిందని ఆ సంఘం నాయకులు, టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కలిదిండి ఎంపిటిసిగా పనిచేసిన సమయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన శైలిలో పని చేశారు. ఆయన నాయీ బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులుగా ఉన్నారు. పలువురు నాయకులు రత్నారావును కలిసి అభినందనలు తెలిపారు.

80 కేసుల్లో నిందితుడిని పట్టించిన బైక్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

80 కేసుల్లో నిందితుడిని బైక్ పట్టించింది. ఈ కరుడు గట్టిన నిందితుడిని కటకటాల పాలు చేసి ఇతనిపై తదుపరి చర్యలకు ఏలూరు జిల్లా పోలీసులు రంగం సిద్ధం చేశారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం మధ్యాహ్నం విలేకర్ల సమావేశంలో ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ వివరాలు వెల్లడించారు. కామవరపుకోట మండలం పాతకొండగూడెం గ్రామానికి చెందిన చీకట్ల సతీష్ (30) అనే వ్యక్తి పదో తరగతి వరకు చదువుకున్నాడు. అక్కడి నుంచి గంజాయికి బానిసైన అతను నేరాల బాట పట్టాడు. స్వయానా ఇతని బావ అయిన తడికలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో డెకాయిట్ షీట్ ఉన్న మాచుకొండ అనిల్ అనే నిందితుడితో కలిసి 2009లో అశ్వారావుపేట పరిసరాల్లో గృహాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. అప్పుడే పోలీసులకు చిక్కి బాలుర వసతి గృహంలో శిక్ష అనుభవించాడు. అంతటితో ఆగకుండా శిక్ష పూర్తి చేసుకుని తిరిగొచ్చిన తర్వాత ఏలూరు, ఏలేశ్వరం, తడికలపూడి, చాగల్లు, ద్వారకాతిరుమల, లక్కవరం, సమిస్రగూడెం, నరసాపురం, కాకినాడ, జంగారెడ్డిగూడెం, రాజమండ్రి, పెదపాడు, దెందులూరు, కైకలూరు, సింగరాయకొండ, తాడేపల్లిగూడెం, దేవరపల్లి, గన్నవరం, ధర్మాజీగూడెం, పెదవేగి, ఆగిరిపల్లి, ఉంగుటూరు, తెలంగాణ రాష్ట్రం పాల్వంచ, హైదరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఇతనిపై 80 చోరీ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఇతనిపై ఉన్న 35 కేసుల్లో శిక్షను అనుభవించాడు. 2013లో ఓ వ్యక్తిని హత్య చేసి అతని కారును అపహరించుకుపోయిన కేసులో చీకట్ల సతీష్ శిక్ష అనుభవించాడు. 2020లో తెలంగాణ రాష్ట్రం పాల్వంచ పోలీసులు సతీష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ పీడీ యాక్ట్‌కు అనుగుణంగా తొమ్మిది నెలల పాటు అతను జైలు శిక్ష అనుభవించాడు. తిరిగొచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాల బాట పట్టాడు. దీంతో తడికలపూడి పోలీసులు 2022లో ఇతనిపై మరోమారు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇటీవల కాలంలో ఈ ఏడాది జులై 19వ తేదీన అక్రమంగా గంజాయి తరలిస్తుండగా తడికలపూడి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అదే సమయంలో రాజమండ్రి సెంట్రల్ జైలులో వేరొక నేరంపై జైలుకు వచ్చిన అబ్బులుతో ఇతనికి పరిచయమైంది. ద్వారపూడి అబ్బులు జంగారెడ్డిగూడెం ప్రాంతంలో వెల్డింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. వీరిద్దరు కలిసి జంగారెడ్డిగూడెం ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వద్ద పార్కు చేసి ఉన్న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఆ ద్విచక్రవాహనంపై తిరుగుతూ ఈ నెల రెండో తేదీన గోపాలపురం మండలం సాగిపాడులో ఆర్టీసీ డిపోకు వెళ్లి వచ్చేసరికి తాళం వేసి ఉన్న వారి ఇంట్లో ఉన్న బంగారం, వెండి నగదు అపహరించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో వీరు ఇరువురు కలిసి చోరీ చేసిన ద్విచక్రవాహనంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఈ కేసులో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్న సమయంలో సతీష్ చోరీ చేసిన ద్విచక్ర వాహనంపై తిరుగుతుండగా పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా సాగిపాడులో జరిగిన గృహ దొంగతనం కేసులో కూడా ఇతను నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతని వద్ద నుంచి 381.128 గ్రాముల బంగారం ఆభరణాలను, నాలుగు కేజీల 151 గ్రాముల వెండి ఆభరణాలను, రూ.246,150 నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా వీటి విలువ రూ.25 లక్షలుగా పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి గిరిజనుడు మృతి

పోలవరం : చేపల వేటకు పోలవరం ప్రాజెక్టు కుడి కాలువలోకి వెళ్లి ఒక గిరిజనుడు మృతి చెందిన సంఘటన గురువారం పోలవరం మండలం వెంకటరెడ్డిగూడెం చోటు చేసుకుంది. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వింజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తాతి దొరబాబు (47) పోలవరం ప్రాజెక్టు కుడి కాలువలోకి చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడని బంధువులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

జీలుగుమిల్లి : మండలంలోని శివగిరి ఆర్అండ్ఆర్ నిర్వాసిత కాలనీ పరిసర ప్రాంతాల్లో జంగారెడ్డిగూడెం డివిజన్ ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన ఒక మహిళ దగ్గర అక్రమంగా నిల్వ ఉన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన 30 మద్యం బాటిళ్లను, మరొక వ్యక్తి వద్ద ఏడు మద్యం బాటిళ్లను గుర్తించినట్లు తెలిపారు. వేర్వేరు దాడుల్లో మొత్తం 37 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడి

చింతలపూడి : నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... నాగిరెడ్డిగూడెంలో దాడులు చేయగా నాటుసారాను బైక్‌పై రవాణా చేస్తున్న అదే గ్రామానికి చెందిన భూక్యా సోనియాను అదుపులోకి తీసుకుని, బైక్‌ను, 50 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతని ఇంటి ఆవరణలో అటవీ స్థలంలో వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటను పూర్తిగా ధ్వంసం చేసినట్లు చెప్పారు. సారా తయారీకి కావాల్సిన బెల్లం సరఫరా చేసిన అదే గ్రామానికి చెందిన రేపాక గోవర్ధన్ నుంచి 22 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాగిరెడ్డిగూడెంలో నాటు సారా కేసులో నిందితురాలిగా ఉన్న భూక్యా బుజ్జిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ తహశీల్దార్ చింతలపూడి ఎదుట హాజరు పరిచి బైండ్ ఓవర్ నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రిపుల్ ఐటిలో జాతీయ మెటలర్జికల్ సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ట్రిపుల్ ఐటిలో మెటలర్జీ, మెటీరియల్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ మెటలర్జీ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ సింపోజియం ఆన్ మెటలర్జీ, మెటీరియల్స్, మ్యానుఫ్యాక్చరింగ్ పేరుతో జాతీయ స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు వరంగల్ నిట్ మెటలర్జీ విభాగాధిపతి ప్రొఫెసర్ కిశోర్ బాబు, విజయనగరం జెఎన్‌టియు మెటలర్జీ విభాగాధిపతి ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, కుశలవ ఇంటర్నేషనల్ పరిశ్రమ డైరెక్టర్ వై.గోపాల్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిలతో కలిసి ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్, డీన్ రత్నాకర్, మెటలర్జీ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాల గురించి వివరించారు. బీటెక్ మెటలర్జీ విద్యార్థులు ఇంజినీరింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేసిన పరిశోధనలకు సంబంధించిన సైంటిఫిక్ పోస్టర్లు ప్రదర్శించారు. మెటలర్జీ ఇంజినీరింగ్ టెక్నాలజీ సంబంధించిన ప్రోటో టైపు మోడల్స్ కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మెటలర్జీ విభాగాధిపతి బి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికారులు లక్ష్మణరావు, శ్రీనాథ్, బ్రహ్మస్వాములు, ఇంజినీరింగ్ విభాగాధిపతులు, మెటలర్జీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు వీరశ్రీను, శివ, మధుసూదన్, శివకుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎంపీ

ప్రజాశక్తి - పోలవరం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ మహేష్‌కుమార్ సూచించారు. పోలవరం మండల కేంద్రంలో ఎపి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూటమి నాయకుల ఆత్మీయ సమావేశ కార్యక్రమం గురువారం ఆయన నివాసం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి నాయకులు నేతలు, కార్యకర్తలు ఐక్యతతో మెలగాలని సూచించారు. ఎపి ట్రైకర్ ఛైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొని అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. ఎంపికి పలువురు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

హెల్మెట్, వాహన పత్రాలు లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు హెచ్చరించారు. చింతలపూడి పాత బస్టాండ్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అతివేగంగా వాహనలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలు అంశాలపై చర్చ

కామవరపుకోట : డ్వాక్రా మహిళలు ఒఎన్‌డిసి ప్రోగ్రాం ద్వారా వారు తయారు చేసే వస్తువులను ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరపడం ద్వారా ఆ వస్తువులు దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందని ఐకెపి వెలుగు ఎపిఎం సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న మండల మహిళ సమాఖ్య బిల్డింగ్‌లో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య పరిధిలోని పలు అంశాలపై చర్చించారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

చింతలపూడి : పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18న వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య కోరారు. రేచర్లలో వ్యక్తిగత అర్జీల నమోదు కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న జరిగే వ్యక్తిగత అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.